క్లుప్తంగా

ముక్తేశ్వరునికి ఎంపీ మోపిదేవి ప్రత్యేక పూజలు



రేపల్లె రూరల్: మహా శివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా మోర్తోట గ్రామంలోని ముక్తేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బండ్లమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు



చందోలు(పిట్టలవాని పాలెం): మండలంలోని చందోలులోని శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మాఘ మాసం ఆఖరి ఆదివారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు కుంచల నరసారెడ్డి తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఈఓ జి.నరసింహ మూర్తి పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



బాపట్ల అర్బన్: మండలంలోని కంకటపాలెం గ్రామంలోని దివ్యాంగుడు గండికోట మణికంఠ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ట్రై సైకిల్ కావాలని కోరాడు. స్పందించిన ఆయన వారంలోనే మణికంఠకు ట్రై సైకిల్‌ను మంజూరు చేయించారు. ఆదివారం బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య మణికంఠకు ఇంటి వద్ద ట్రై సైకిల్ అందజేశారు. మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రేషన్‌లో ప్లాస్టిక్ బియ్యం..?



భట్టిప్రోలు: భట్టిప్రోలులో రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిసి రావడంతో కార్డుదారులు అవాక్కయ్యారు. స్థానిక రేషన్ షాప్–2 ద్వారా భట్టిప్రోలు విఠలేశ్వరస్వామి గుడి వద్ద ప్రజా పంపిణీ వాహనంలో బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేశారు. బియ్యం నానబెడితే కొన్ని పైన తేలియాడుతూ మరమరాలు మాదిరిగా మారి చేతితో నొక్కితే సాగుతూ పిండిలా అవుతున్నాయని కొందరు తెలిపారు. కిలో బియ్యం ఏరితే ఈ రకం బియ్యం 50 గ్రాములు వరకు వస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ డి.రవీంద్ర బాబును వివరణ కోరగా బియ్యాన్ని పరిశీలించిన తరువాతే ఏ విషయం అనేది చెప్పగలమని సమాధానం ఇచ్చారు. సోమవారం సరఫరా చేసిన షాపునకు విచ్చేసి బియ్యాన్ని పరిశీలించనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పోషక విలువలు కలిగిన పోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

గాన గంధర్వుడు ఘంటసాల



తెనాలి: పట్టణానికి చెందిన సాంస్కృతిక సంస్థ శ్రీ కళారంజని ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత విభావరిని నిర్వహించారు. ప్రారంభ సభకు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కేఎస్ఎల్ పద్మావతి అధ్యక్షత వహించారు. సినిమా సంగీతానికి ఒక గౌరవాన్ని, స్థాయిని కల్పించిన గాన గంధర్వుడు ఘంటసాల అని చెప్పారు. ఆచార్య మన్నవ సత్యనారాయణ మాట్లాడుతూ ఘంటసాల ఎంత గొప్ప గాయకుడో, అంత గొప్ప వ్యక్తిత్వం కలిగినవారని చెప్పారు. కార్యదర్శి గోనుగుంట్ల మురళీకృష్ణ, గౌరవాధ్యక్షుడు వాకా పేరిరెడ్డి తమ ప్రసంగాల్లో ఘంటసాల గాన సౌందర్యం గురించి వివరించారు. వీవీఎస్ సందీప్‌కుమార్, వాకా కరుణ, సునీత పాల్గొన్నారు.

టార్గెట్ 100 %

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- సబ్జెక్ట్‌ల రివిజన్, టెస్ట్‌లతో పబ్లిక్ పరీక్షలపై పట్టు
- నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం..



స్టడీ అవర్‌లో పదో తరగతి విద్యార్థినులు

బాపట్ల అర్బన్: విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. పరీక్షల్లో సాధించే మార్కులే విద్యార్థి ఉన్నత విద్యకు తొలిమెట్టు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పరీక్షల సన్నద్ధతకు ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల్లో స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి, విద్యార్థులను ప్రణాళిక బద్ధంగా చదివిస్తున్నారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయి. గతంలో ఉండే 11 ప్రశ్న పత్రాలను ఈ ఏడాది నుంచి ఆరు పేపర్లకు కుదించారు. పరీక్ష 3.15 గంటలు కాగా ఒక్కో పేపర్ 100 మార్కులకు ఉంటుంది. పాఠశాలల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. బాపట్ల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఈ ఏడాది 17,288 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మంచి మార్కులు సాధించేలా ముందస్తుగా మాక్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అన్ని సబ్జెక్టుల బోధనను ఉపాధ్యాయులు పూర్తి చేశారు. జనవరి నుంచి రోజుకో సబ్జెక్టు చొప్పున రివిజన్ టెస్ట్‌లు పూర్తి చేశారు. ప్రతి సబ్జెక్ట్ నుంచి రోజుకొక పాఠ్యాంశాన్ని రివిజన్ చేయించడం ద్వారా మొత్తం సిలబస్ పునశ్చరణ జరుగుతుంది.

ప్రత్యేక తరగతులతో మేలు



ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు మార్కుల సాధనకు ఉపయోగపడుతాయి. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని పట్టుదలతో చదువుతున్నాను. ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులను శ్రద్ధగా బోధిస్తున్నారు.

– పొందుగల శ్రావ్య, విద్యార్థిని, గురుకుల పాఠశాల, బాపట్ల

రోజూ రివిజన్ టెస్టులు..



ప్రత్యేక తరగతుల్లో రివిజన్ టెస్టులు పెడుతున్నారు. మరుసటి రోజు తప్పులను సరి చేయించడం పబ్లిక్ పరీక్షలకు ఎంతో సహాయ పడుతుంది. లెక్కలు, సైన్స్ సబ్జెక్టులను బాగా చదువుతున్నాను.

– మేడికొండ వర్షిత, విద్యార్థిని, గురుకుల పాఠశాల, బాపట్ల

పర్యవేక్షిస్తున్నాం



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్లు, ఎంపీడీఓ, ఏపీఎంఓలతో కలిసి పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నాం. డీసీఈబీ ఇచ్చిన 60 రోజుల కార్యచరణను అమలు చేస్తున్నాం. నూరు శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేస్తున్నాం.

– పీవీజే రామారావు, డీఈఓ, బాపట్ల జిల్లా

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



సమ్మేటివ్ పరీక్షలు పూర్తి కావడంతో చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. విద్యార్థులు పరీక్షల ఒత్తిడిలో విద్యార్థులు పొరపాట్లు చేస్తారు. సులభ పద్ధతిలో మంచి మార్కులు ఎలా పొందాలో ప్రత్యేక తరగతుల్లో బోధిస్తున్నాం.

– కమ్మ భవానీ దేవి, ప్రిన్సిపల్, గురుకుల పాఠశాల, బాపట్ల

కనుల పండువగా కల్యాణం



పూజలందుకున్న స్వామివార్లు



వెల్లటూరులో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణ మూర్తులైన స్వామి, అమ్మవార్లు

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): గ్రామంలోని శ్రీ విద్యాచైతన్య పీఠంలో శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత శ్రీ మహాచంద్రమౌళేశ్వర స్వామివార్ల కల్యాణ మహోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. మహా శివరాత్రి సందర్భంగా నల్లమోతు వారిపాలెం పీఠంలో పీఠాధిపతి స్వామి సద్గానానంద పర్యవేక్షణలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. తొలుత అలయం నందు శాంతిహోమం నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది.

వైభవంగా అగస్త్యేశ్వరస్వామి కల్యాణం

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు గ్రామంలో శ్రీ బాల త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. లింగోద్భవ కాలంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకులు బి.సుందరశర్మ, కె.రాజేష్ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఈఓ దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం బలిహరణ, రథోత్సవం నిర్వహించారు. సోమవారం వసంతోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలులోని గంగా పార్వతీ సమేత విఠలేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పలువురు దంపతులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం

పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలోని పెదపులివర్రులో కొలువైన బాల త్రిపుర సుందరి సమేత శ్రీ రాజరాజ నరేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అలాగే జగజ్యోతి కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉభయదాతలు బైర్రాజు మధుసూదనరావు, కొడమంచిలి చలపతి రావు సోదరులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం స్వామి రథోత్సవం కనుపండువగా సాగింది. ఈ కార్యక్రమానికి ఉభయదాతగా నూతక్కి నాగేశ్వరరావు వ్యవహరించారు. ఈఓ మేకా సాంబ శివరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ జంపని అంజయ్య, సభ్యులు పర్యవేక్షించారు. సోమవారం వసంతోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మంత్రి వెళ్లిన వీధులకు సీసీ రోడ్లొచ్చాయి..



ఐలవరంలో పూర్తయిన సీసీ రోడ్డు

ఐలవరం(భట్టిప్రోలు): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ఈ కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి ఉపకరిస్తోంది. మండలంలోని ఐలవరం–2 సచివాలయం పరిధిలో పర్యటించిన రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు గ్రామస్తులు అంతర్గత రోడ్లు సరిగా లేవని, బాగుచేయాలని కోరారు. ఆయన ఆదేశాలతో అధికారులు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. సుమారు 400 మీటర్ల మేర గ్రామంలోని ఆరు ఏరియాలలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయింది. గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వర రావు, ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు సీసీ రోడ్ల నిర్మాణం వేగంగా జరిగేలా కృషి చేశారు. త్వరలో మంత్రి నాగార్జునతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

దొరస్వామికి నేతల నివాళి



దొరస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మోపిదేవి, మంత్రి అంబటి

రేపల్లె: మాజీ జడ్పీటీసీ గరికపాటి వెంకట నారాయణ దొరస్వామి సంస్మరణ కార్యక్రమం పట్టణంలోని యలవర్తి వారి వీధిలో ఉన్న ఆయన స్వగృహంలో ఆదివారం జరిగింది. జడ్పీటీసీగా, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా, బార్ అసోసియేషన్ సభ్యునిగా ఆయన చేసిన సేవలను పలువురు గుర్తుచేసుకొన్నారు. దొరస్వామి చిత్రపటానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, బాపట్ల అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, కమతం సాంబశివరావు, రసాలయ కళా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కోడె గౌరీశంకర్, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ నివాళులర్పించారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో బీజేపీ విఫలం

తెనాలి అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అఖిల భారత యువ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో విద్యార్థి సంఘాల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాల్ని భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, విమానం, బ్యాంకింగ్ వంటి రంగాలను కూడా ప్రైవేటు పరం చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. విశాఖ ఉక్కును కూడా ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రం ముందడుగు వేస్తుందని ఆరోపించారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని హితువు పలికారు.

పెరిగిన బాలకోటేశ్వరుని తిరునాళ్ల రాబడి



హుండీ నగదు లెక్కిస్తున్న సిబ్బంది

రేపల్లె రూరల్: అరవపల్లి బాలకోటేశ్వర స్వామి తిరునాళ్ల రాబడి గతేడాది కంటే పెరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.రాజేశ్వరరావు తెలిపారు. ఆలయ ఆవరణంలో ఆదివారం కానుకల లెక్కింపు నిర్వహించారు. వివరాలను ఈఓ వెల్లడించారు. గతేడాది రూ.10,00,681లు రాగా ఈ ఏడాది రూ.10,23,927లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. రూ.23,246లు పెరిగిందన్నారు. హుండీలోని కానుకల ద్వారా రూ.4,97,217లు, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,47,730, కేశ ఖండన ద్వారా రూ.580, అభిషేకాలకు రూ.1,47,000, ప్రసాదాల విక్రయాలతో రూ.1,89,200, కొబ్బరి చిప్పలు అమ్మకంలో రూ.35,000, నెయ్యి అమ్మకంతో రూ.7,200లు సమకూరిందని తెలిపారు.

గల్లంతైన వ్యక్తిని కాపాడిన గజ ఈతగాళ్లు



గల్లంతైన వ్యక్తితో గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బంది

బాపట్లటౌన్: సముద్ర స్నానాలు ఆచరిస్తూ.. అలల తాకిడికి సూర్యలంక తీరంలో గల్లంతైన వ్యక్తిని గస్తీ నిర్వహిస్తున్న గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బంది కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాదుకు చెందిన విజయ్ తన స్నేహితులతో కలిసి సముద్ర స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలలు అతనిని ముంచేత్తాయి. దీంతో సముద్రంలో కొట్టుకుపోతున్న విజయ్‌ను కాపాడేందుకు స్నేహితులు చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో వెంటనే కేకలు పెట్టారు. వెంటనే గజ ఈతగాళ్లు కొక్కిలిగడ్డ సుబ్బారావు, కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు, సింగోతి ఆంజనేయులు అప్రమత్తమయ్యారు. వీరితోపాటు అవుట్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఎం.పోతురాజు గల్లంతైన విజయ్‌ను కాపాడారు. తక్షణమే స్పందించి ప్రాణాలు కాపాడిన సిబ్బంది, గజ ఈతగాళ్లను ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్ : కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండలంలోని నరసాపురం గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లిన ఆయన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతీ పనికి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పరుగులు తీయాల్సి వచ్చేదని, ప్రస్తుతం సచివాలయ వ్యవస్థతో ఆ పరిస్థితి లేదన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతల హరిబాబు, గవిని కృష్ణమూర్తి, వడ్డి ముక్కల డేవిడ్, సొసైటీ ప్రెసిడెంట్ జయరామిరెడ్డి, సర్పంచ్ దాసి హైమావతి, ఎంపీటీసీ దేవరపల్లి జయమణి, ఆట్ల ప్రసాద్ రెడ్డి, వీఆర్వో నాగకుమారి, రూరల్ ఎస్సై వెంకటప్రసాద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సాయినాథుని ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న సాయినాథుడు

రేపల్లె: పట్టణంలో 8వ వార్డులోని శ్రీ షిర్డీ సాయినాథుని ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచే బాబాకు సుప్రభాత సేవ, అభిషేక మహోత్సవాలు నిర్వహించారు. పట్టువస్త్రాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

సాయి నామంతో మార్మోగిన బాపట్ల

బాపట్ల అర్బన్: బాపట్ల కొత్త బస్టాండ్ వద్ద జీబీసీ రోడ్డులోని షిర్డీ సాయిబాబా దేవాలయంలో 27వ ప్రతిష్ఠ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం స్వామివారికి కాగడ హారతి, పంచామృతాలతో అభిషేకం జరిగింది. విశేష అలంకరణ అనంతరం గురుపాదుక పూజా కార్యక్రమం మధ్యాహ్నం హారతి ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టారు. బాబా ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, కమిటీ సభ్యులు, అర్చక స్వాములు కర్లపాలెం మోహనరత్న సాయిస్వామి, పమిడిగటం సాయికిరణ్, పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో150 మందికి పరీక్షలు

తెనాలి టౌన్: రూరల్ మండలం కంచర్లపాలెంలో తెనాలికి చెందిన భీష్మ ఐకేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కోపల్లె మణిమ్మ ప్రారంభించారు. శిబిరంలో వైద్యశాల డాక్టర్ కె.శివరామిరెడ్డి సుమారు 150 మందికి పరీక్షలు చేశారు. శుక్లాలు ఉన్నవారికి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మణిమ్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్‌బాబు, వైద్యశాల నిర్వాహకులు బండ్లమూడి రాజేష్, జ్యోతి, మల్లీశ్వరి, సురేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు కోపల్లె సురేష్, కొఠవరపు శివయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి గ్రామోత్సవం

నగరం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరం పుర వీధులలో గంగాంభిక సమేత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామి వారికి పూజా సామగ్రి అందించి, పూజలు చేశారు. శివరాత్రి రోజున స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించి, గ్రామోత్సవంగా వైభవంగా చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చిరస్మరణీయుడు ఛత్రపతి శివాజీ



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్, హరికృష్ణ తదితరులు

తెనాలి అర్బన్: మొగల్ పాలకులపై వీరోచితంగా పోరాడి భారతదేశాన్ని రక్షించిన మహనీయుడు ఛత్రపతి శివాజీ అని కడియాల సునీల్‌కుమార్ కొనియాడారు. శివాజీ జయంతిని పురస్కరించుకుని శివశక్తి, బీజేపీ యువ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లోని ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో మైలా హరికృష్ణ, కె.వి.సుబ్బారావు, చేతుల వెంకట్రావు, కడలి కుమార్, దాసరి వెంకటనాగరాజు, నందికంటి రామాంజనేయులు, మాతూరి లక్ష్మీనారాయణ, తరుణ్ గోపి, జగదీష్, కుర్రా శివ, ధూళ్ల భరత్, తన్నీరు శివశంకర్ పాల్గొన్నారు.

సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న విద్యార్థులు

తెనాలి టౌన్: సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనలో భాగంగా శ్రీలక్ష్మీ శారదా సంగీత ఆలయం విద్యార్థులు బోసు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పంచరత్న, ఉపచార కీర్తనలు ఆలపించారు. తొలుతగా సంగీత గురువులు గౌరావఝుల ఆంజనేయశాస్త్రి ఇంటి నుంచి నగర సంకీర్తనలు ఆలపిస్తూ వాసవీ ఆలయానికి చేరుకున్నారు. త్యాగరాజస్వామి విరచిత ఘన రాగాల్ని విద్యార్థులు ఆలపించారు. గత 35 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంజనేయశాస్త్రి తెలిపారు. తీర్థప్రసాదాలు వితరణ చేశారు. మృదంగంపై వెంకట రామకృష్ణ, వైలెన్‌పై శ్రీకృష్ణ అభిరామ్, ఆంజనేయశాస్త్రి సహకరించగా, కొండపి శ్రీనివాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్తీక్, సౌజన్య, కుమార శ్యామ్‌కృష్ణ శర్మ, అరుణ, వల్లి పాల్గొన్నారు.

హోరోబు ప్రార్థన మందిరంలో ముగిసిన వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న బ్రదర్ ఇమ్మానియేల్, ఫిలిప్

తెనాలి టౌన్: చెంచుపేట ఇందిరాకాలనీలోని హోరోబు ప్రార్థన మందిరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆరో వార్షిక వేడుకలు ఆదివారంతో ముగిశాయి. సంఘ కాపరి బ్రదర్ భక్తసింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ప్రత్యేక వర్తమానికులు బ్రదర్ ఇమ్మానియేలు జమరాజ్ (విజయవాడ) బ్రదర్ ఫిలిప్‌లు (జమ్మలమడుగు) వాక్య సందేశం అందజేశారు. ప్రార్థనల్లో పాల్గొన్న వారికి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వాసులు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జోల జ్యోతి పూజ

తెనాలి టౌన్: మహా శివరాత్రి పర్వదినం రోజున శనివారం అర్ధరాత్రి గంగానమ్మపేటలోని పాత శివాలయంలో జోల జ్యోతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హర హర మహాదేవ శంభోశంకర అంటూ భక్తులు నినాదాలు చేశారు. శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది. అర్చకుడు పసి జ్యోతిని వెలిగించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెసర్లంక రమణ, కల్పన దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కుర్రా శ్రీను, షేక్ మీరావలి, తట్టుకుళ్ళ ఆశోక్‌యాదవ్, దోనేపూడి రాఘవేంద్రరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రమణకుమారి, భక్తులు పాల్గొన్నారు. శివాలయంలో ఆదివారం జరిగిన శివ కల్యాణంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు.